సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 15 । మార్చి । 2023



పట్టుకున్నా పట్టింపేది..?

కొత్తగూడెం మున్సిపాలిటీలో వీధి కుక్కలను పట్టుకుని బంధించిన అధికారులు.. వాటి సంరక్షణను మాత్రం మరిచారు. 8లో



కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం

ఇల్లెందు కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. ఇరు వర్గాల నేతలు బాహాబాహీకి దిగారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
37° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉన్నా, రాత్రికి వాతావరణం చల్లబడుతుంది. చిరు జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పవిత్ర తీర్థ జలాల సేకరణ



శ్వేత పుష్కరిణి తీర్థాన్ని సేకరిస్తున్న అర్చకులు

భద్రాచలం: పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు మంగళవారం పుష్కర, శ్వేత పుష్కరిణి తీర్థ జలాలను సేకరించారు. రాజస్థాన్‌లోని పుష్కర్ తీర్థాన్ని అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కలకోట పవన్‌కుమారాచార్యులు కలశంలోకి తీసుకున్నారు. ఇక కూర్మ క్షేత్రంలోని శ్వేత పుష్కరిణీ నుంచి సౌమిత్రి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పవిత్ర తీర్థాన్ని సేకరించారు. దేశం నలు మూలల నుంచి సేకరిస్తున్న ఈ పవిత్ర జలాలన్నీ ఈనెల 25 లోపు భద్రాచలం చేరుకోనున్నాయి.

12.30 వరకే పాఠశాలలు నిర్వహించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకే నడపాలని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేటి నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి, ఇళ్లకు పంపాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున వారిని మాత్రం సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలల్లోనే ఉంచి చదివించాలని తెలిపారు. ఈ మేరకు ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు.

30 వరకు స్వచ్ఛోత్సవ్ క్యాంపెయిన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా ఈనెల 30 వరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా స్వచ్ఛోత్సవ్ క్యాంపెయిన్ నిర్వహిస్తోందని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం వ్యక్తిగతంగా, స్వయం సహాయక సంఘాలు, చిన్న తరహా మహిళా ఎంటర్ ప్రైజెస్, స్టార్టప్స్, ఎన్‌జీఓలు ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదు ఉత్తమ దరఖాస్తులను ఎంపిక చేసి, ఒక దరఖాస్తును స్టేట్ స్వార్ సెంట్రల్‌కు పంపిస్తామని తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగర, రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులతో సత్కరిస్తామని వివరించారు. ఈనెల 29న వార్డుల వారీగా స్వచ్ఛతా యాత్ర ర్యాలీలు నిర్వహిస్తామని, వివరాలకు 9492850004 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నువ్వెక్కడ బంగారం?!

తెల్లచేపల్లో బంగారుతీగపై ఆసక్తి

- ఉమ్మడి జిల్లాలో లభ్యత లేక జలపుష్పాల ప్రియుల్లో నిరాశ
- పెంపకమే తక్కువ.. ఆపై వలలకు చిక్కని 'తెలివైన' చేపలు
- జలాశయాల్లో నీరు అడుగంటాకే లభించే అవకాశం



చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

మటన్, చికెన్‌తో పోలిస్తే ఆరోగ్యం, రుచి, లభ్యత, ధర.. ఇలా ఏ విషయంలో పోల్చినా చేపలు ప్రత్యేకం! ఇందులో కొర్రమీను(నల్ల చేపలు) ధర ఎక్కువ కావడంతో అన్నివర్గాల ప్రజలు తెల్ల చేపలైన రవ్వ, బొచ్చె, బంగారుతీగలపై ఆసక్తి కనబరుస్తారు. ఇక వీటిలో బంగారుతీగ మరింత ప్రత్యేకమని అటు మత్స్యకారులు, ఇటు చేపల ప్రియుల్లో ఎవరిని అడిగినా చెబుతారు. రూపం, రుచి తదితర అంశాల్లో మిగతా వాటితో పోలిస్తే ప్రత్యేకంగా ఉండే బంగారు తీగ రకం చేపలు ఉమ్మడి జిల్లాలో పెద్దగా లభించడం లేదు. ఈ చేప ప్రత్యేకత ఏమిటి, ఎందుకు మార్కెట్‌లో అంతగా లభించడం లేదనే అంశంపై మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులను సంప్రదించగా.. అనేక విషయాలు చెప్పుకొచ్చారు.

– ఖమ్మం డెస్క్



రూపం, రుచిలో ప్రత్యేకం

స్థానికంగా లభించే ఇతర చేపలతో పోలిస్తే బంగారు తీగ రకం చేపలో ముళ్లు తక్కువగా ఉండడమే కాక రుచికరంగా ఉంటుంది. చిన్న చెరువులు, కుంటల్లో మాత్రమే ఈ రకం చేపలను పెంచుతారు. ఇవి చెరువు అడుగు భాగంలో ఉన్న మట్టి, బురదలో తిరుగుతూ అదే మట్టి, బురద(ఒండు)ను ఆహారంగా తీసుకుంటాయి. ఇవి సాధారంగా వలలకు చిక్కవు. చెరువు అడుగు భాగంలో ఉండడంతో జలాశయంలో పూర్తిగా నీరు అడుగంటినప్పుడే బయటపడతాయి. తద్వారా ఈ రకం చేపలు చిన్న చెరువుల్లో నీరు అడుగంటాక ఏప్రిల్, మే నెలల్లో లభ్యమయ్యే అవకాశం ఉండడంతో మిగిలిన కాలంలో అంతగా మత్స్యకారుల వలలకు చిక్కవు.

నిల్వకు పనికిరావు..

తెల్ల వాటిలో రుచిగా ఉండే బంగారు తీగ రకం చేపలు నిల్వకు పనికిరావు. త్వరగా చనిపోయి పాడైపోయే గుణం కలిగిన ఈ చేపలను మత్స్యకారులు చెరువుల్లో పట్టగానే అక్కడికక్కడే విక్రయిస్తారు. అదే రవ్వ, బొచ్చె రకం చేపలను ఎగుమతి చేసే అవకాశం ఉండడంతో వీటి పెంపకానికి ఆసక్తి కనబరుస్తారు. ధర విషయంలో తెల్ల చేపలన్నీ ఒకే మాదిరి ఉండగా.. తరుగు విషయానికొస్తే బొచ్చె, రవ్వ వంటివి కేజీకి 250 గ్రాములు, బంగారు తీగ రకమైతే 400 గ్రాముల మేర తరుగుపోతుంది. అయినప్పటికీ రుచి ఎక్కువ, ముళ్లు తక్కువగా ఉండే వీటిని చేపల ప్రియులు ఎక్కువగా ఇష్టపడతారు. కానీ మార్కెట్‌లో లభ్యత లేపోవడం వారిని నిరాశ పరుస్తోంది.

చిన్న చెరువుల్లోనే పెంపకం

బంగారు తీగ రకం చేపలను చిన్న చెరువుల్లోనే పెంచుతారు. అందుకే ఇవి పెద్ద జలాశయాలు, రిజర్వాయర్లలో అంతగా కనిపించవు. దీనికి తోడు నిల్వ ఉండే గుణం లేకపోవడంతో చెరువుల్లో పట్టగానే అక్కడికక్కడే విక్రయిస్తుండడంతో ఈ రకం చేపలు మార్కెట్లకు అంతగా తీసుకురామని విక్రయదారులు చెబుతున్నారు. కాగా, ఏటా ప్రభుత్వం చెరువుల్లో వంద శాతం సబ్సిడీపై 35–40 మి.మీ., 80–100 మి.మీ.ల పొడవైన చేపపిల్లలను వదులుతోంది. ఇందులో మొదటి రకంలోనే బంగారు తీగ రకం చేపపిల్లలు ఉండడం, అవీ చిన్న చెరువుల్లోనే వదులుతున్న కారణంగా మార్కెట్‌లో అంతగా లభించడం లేదని సమాచారం.

ఉమ్మడి జిల్లాలో చేపల పెంపకం ఇలా..

- ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది చిన్నా పెద్ద కలిపి 1,129 జలాశయాల్లో చేప పిల్లలను విడుదల చేశారు. 35–40 మి.మీ. పొడవైన 1,16,63,127 పిల్లలను చిన్న చెరువుల్లో పోశారు. ఇందులో బంగారుతీగ రకం 35,08,236 పిల్లలు ఉంటాయని అంచనా. 80–100 మి.మీ. పొడవైన 85,69,320 చేప పిల్లలు వదిలారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 743 జలాశయాల్లో 1,77,42,420 చేప పిల్లలను పోశారు. ఇందులో 35–40 మి.మీ. పొడవైన చేపపిల్లలు 91,61,100 ఉండగా.. ఇందులో బంగారు తీగ రకం 27,48,330 పిల్లలు ఉంటాయి. ఇక 80–100 మి.మీ. పొడవైన 85,81,320 చేపపిల్లలను చెరువుల్లో వదిలి నట్లు అధికారిక గణంకాలు చెబుతున్నాయి.

అడుగున ఉంటాయి



బంగారుతీగ రకం చేపలను చిన్న చెరువులు, కుంటల్లో పెంచుతాం. ఒండ్రు మట్టి బురద, మట్టి ఆధారంగా నీటి అడుగున ఉండడంతో వలలకు చిక్కవు. మిగిలిన చేపలతో పోలిస్తే వీటికి తెలివి ఎక్కువే. చెరువులో నీరు అడుగంటాక బంగారు తీగలు పడితే అక్కకడికక్కడే అమ్ముతాం.

– తురక రాంబాబు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

సహజసిద్ధమైన చేప..



చెరువుల్లో అడుగున ఉండే బంగారుతీగ చేపలు మాగిన సేంద్రియ పదార్థాన్ని ఆహారంగా తీసుకుంటాయి. ఇది సహజసిద్ధంగా ఉండి త్వరగా అభివృద్ధి చెందుతాయి. రుచి ఇతర వాటికన్నా బాగున్నా నిల్వ, ఎగుమతికి పనికిరావు. జలాశయాల్లో నీరు అడుగంటితేనే ఎక్కువగా లభిస్తాయి.

– డి.ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

'పేట'ను రోల్ మోడల్ చేస్తాం

- ఈ ప్రభుత్వాన్ని దింపడం ఎవరి తరమూ కాదు
- అభివృద్ధి పనులు చేపట్టని వారు మాట్లాడుతున్నారు..
- పదవిలో ఉన్నప్పుడు తట్టెడు మట్టి పోశావా..?
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



జమ్మిగూడెంలో మహిళకు కంటి అద్దాలు పెడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే మెచ్చా, కలెక్టర్ అనుదీప్

అశ్వారావుపేట: తెలంగాణ రాష్ట్రానికి ముఖ చిత్రంగా ఉన్న అశ్వారావుపేటను రానున్న నాలుగు నెలల్లో సుందరీకరిస్తామని, వెలుగు జిలుగులతో రోల్ మోడల్‌గా మారుస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించారు. మొదట దమ్మపేట మండలం ముష్టిబండలోని అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్టీఏ సబ్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మాట్లాడుతూ.. ఆర్టీఏ సేవల కోసం 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడేనికి వెళ్లాల్సి వస్తోందని స్థానిక ఎమ్మెల్యే చెప్పడంతో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ ప్రతి మంగళ, శుక్రవారాల్లో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల వారికి సేవలు అందుతాయన్నారు. త్వరలోనే పక్కా భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 25 వేలకు పైగా జనాభా ఉన్న అశ్వారావుపేటకు మున్సిపాలిటీ హోదా కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

కేసీఆర్‌ను ఎవరూ గద్దె దించలేరు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, ఈ సర్కారును గద్దె దింపాలని కొందరు రంకెలేస్తున్నారని, వారి రంకెలకు ప్రభుత్వం దిగిపోతుందా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయికి తీసుకెళుతుంటే చూడలేకపోవడం విచారకరమని, పైగా అవాకులు, చవాకులు పేలడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రాన్ని నాశనం చేద్దామనే వారి పగటి కలలు సాకారం కావన్నారు. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అన్నారు. రైతుల కోసమే సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని, సకాలంలో పనులు పూర్తిచేస్తామని చెప్పారు. 'ప్రాజెక్టు కోసం నీవు రంది పడాల్సిన పనిలేదు.. నిన్నా మొన్నటి వరకు ఇదే ప్రభుత్వంలో బాధ్యతగల పదవిలో ఉన్న నువ్వు.. ఇప్పుడు ప్రజలు కష్టపడుతున్నారని అనడం విడ్డూరంగా ఉంది' అని మాజీ ఎంపీ పొంగులేటిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నపుడు ప్రజల కష్టాలు కనిపించలేదా అని ప్రశ్నించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలను దుర్వినియోగం చేసుకుని, స్వలాభం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నావని, ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసిన జాబితాలో మీ పేరే లేదని అన్నారు. జిల్లాను తీర్చిదిద్దినట్లు ఉపన్యాసాలు చెబితే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఎంపీపీ జయపాల్ రెడ్డి, వేణు, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై మంత్రి, ఎమ్మెల్యే



బుల్లెట్‌పై మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం ఒకే బుల్లెట్‌పై పర్యటించి కార్యకర్తల్లో జోష్ నింపారు. జమ్మిగూడెం నుంచి అశ్వారావుపేటకు వస్తున్న మంత్రి, ఎమ్మెల్యే కారు దిగి బుల్లెట్ ఎక్కి బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీగా కార్యకర్తలతో కలిసి రింగ్‌రోడ్ వరకు వచ్చారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కలెక్టర్ అనుదీప్ సూచన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

అశ్వారావుపేటరూరల్: వేసవి నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఐదేళ్ల లోపు చిన్నారులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మండల పరిధిలోని జమ్మిగూడెంలో మంగళవారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులు అధిక సంఖ్యలో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.. రికార్డులు, పోషకాహారాన్ని తనిఖీ చేశారు. చిన్నారులతో పాటలు పాడించి, వారితో కాసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎండలు పెరిగే అవకాశం ఉందని, చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కేంద్రంలో తక్షణమే ఫ్యాన్లు ఏర్పాటుచేయాలని సర్పంచ్ సూర్యప్రభ, సీడీపీఓ రోజారాణిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, తహసీల్దార్ లూథరన్ విల్సన్, ఎంపీడీఓ విద్యాధరరావు, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి



ఆరోగ్య మహిళ సేవలను పరిశీలిస్తున్న స్వర్ణలత లెనినా

అన్నపురెడ్డిపల్లి : మహిళల సంపూర్ణ ఆరోగ్య కోసం ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం మహిళా వైద్యులు, సిబ్బంది మహిళలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ సేవలను జిల్లా ప్రోగ్రాం అధికారి మణికంఠారెడ్డి కూడా పరిశీలించారు. అనంతరం శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక, డాక్టర్ తన్మయి, చంద్రుగొండ సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్ గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగానే 'జెడ్పీ'!

- సమావేశానికి వచ్చామా.. వెళ్లామా అన్నట్టుగా అధికారులు
- డుమ్మా కొడుతున్న పలువురు ప్రజాప్రతినిధులు
- ఈ సారైనా సమస్యలపై చర్చించేనా..?
- నేడు జిల్లా పరిషత్ సమావేశం



జెడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

చుంచుపల్లి: జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపించాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశం ప్రతిసారీ మొక్కుబడిగానే సాగుతోంది. మూడు నెలలకోసారి జరిగే ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చామా.. వెళ్లామా.. అన్నట్టుగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదారు శాఖలపై నామమాత్రంగా చర్చించి మమ అనిపిస్తున్నారని కొందరు సభ్యులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ఎంపీపీలు అసలు హాజరే కావడం లేదు. మరి బుధవారం నిర్వహించే సమావేశంలోనైనా ప్రాధాన్యత అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించి ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటారా అని పలువురు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా హాజరై తమ ప్రాంత సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది.

45 శాఖలున్నా.. ఐదారుతోనే సరి..

జిల్లా పరిషత్ పరిధిలో 22 గ్రామీణ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని 481 గ్రామ పంచాయతీల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాల తీరుతెన్నులు, చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సి ఉంటుంది. జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు 22 మంది ఎంపీపీలు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. ప్రస్తుతం జిల్లాలో 21 మంది మాత్రమే ఎంపీపీలు ఉన్నారు. కలెక్టర్, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కూడా శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆహ్వానితులుగా కొనసాగుతున్నారు. జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోకి దాదాపు 45 ప్రభుత్వ శాఖలు వస్తాయి. ఆయా శాఖల పనితీరుపై అధికారులు ప్రగతి నివేదికలు తయారు చేస్తారు. మొత్తం 45 శాఖలున్నా ప్రతిసారి జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఐదారు శాఖలకే ప్రాధాన్యం కలిపిస్తున్నారు. అన్ని శాఖలపై కాకున్నా.. కనీసం ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న కీలక సమస్యలను పరిష్కరించాల్సిన శాఖలపై దృష్టిసారించాలని పలువురు అంటున్నారు. కేవలం ప్రగతి నివేదికలను మాత్రమే చదివి వినిపించి అధికారులు మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వైద్యం, విద్య, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, రెవెన్యూ, పోడు వంటి కీలక శాఖల పనితీరుపై సుదీర్ఘ చర్చ జరగడం లేదు. అటు సభ్యులు సైతం సమావేశానికి నామమాత్రంగానే హాజరై వెళ్లి పోతున్నారు. గ్రామాల పరిధిలో ప్రధాన సమస్యలను సమావేశం దృష్టికి కొందరు మాత్రమే తెస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జెడ్పీ సర్వసభ్య సమావేశాల్లో మొక్కుబడిగా కాకుండా ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మూడు రోజులు అకాల వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వచ్చే మూడు రోజులు ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం శాస్త్రవేత్త వింధ్య, పర్యవేక్షకులు సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాలతో యాసంగిలో సాగు చేస్తున్న మొక్కజొన్న, మిరప, కూరగాయలు, మామిడి వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని తెలిపారు. వరి, జొన్న, మొక్కజన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు వాయిదా వేయాలని, కోసిన మిరప కాయలు గోదాములకు తరలించడం లేదా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

విచారణ ఏమాయె ?

- 'డబుల్' ట్రబుల్‌పై ఆగని నిరసనలు
- ఇళ్లను అక్రమించి అర్హులకు ఇస్తామంటూ రాజకీయ పక్షాల హెచ్చరికలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని, అనర్హులకు రద్దుచేసి అర్హులకు కేటాయించాలని కోరుతూ నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. కొత్తగూడెం, పాల్వంచలలో లాటరీ పద్ధతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేశామని అధికారులు చెబుతున్నా.. అనర్హులకే చోటు దక్కిందని, ఇందుకుగాను రూ.లక్షలు చేతులు మారాయని అర్హులైన పేదలు ఆరోపిస్తున్నారు. ఈ నిరసన సెగ కలెక్టరేట్‌కు కూడా చేరడంతో దీనిపై రీసర్వే చేసి అనర్హులకు కేటాయిస్తే రద్దు చేస్తామని, మరోసారి పారదర్శకంగా విచారణ నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే అది నేటికీ కార్యరూపం దాల్చడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేటాయింపుల్లో అక్రమాలపై ఇప్పటికే వివిధ పార్టీల నాయకులు ఆందోళన బాట పట్టారు. విచారణ, రీసర్వే ఎంతవరకు వచ్చిందో తెలియక ఆందోళనలు ఉధృతం చేయడానికి సిద్ధపడుతున్నారు.

లాటరీ తీసిన రోజు నుంచే..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల రెండో తేదీన లాటరీ నిర్వహించారు. అయితే ఇందులో అక్రమాలు జరిగాయంటూ ఆరోజు నుంచే నిరసనలు ప్రారంభమయ్యాయి. కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల చర్యలతో పేదలకు అన్యాయం జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ సెగ ఈనెల 6వ తేదీన కలెక్టరేట్‌కు తగిలింది. 500 మందికి పైగా పేదలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయడమే కాక తిరిగి దరఖాస్తులు సమర్పించారు. అయితే కేటాయింపుల్లో అవినీతి జరిగినట్లు ఏ ఆధారాలున్నా అదనపు కలెక్టర్, డీఆర్వోకు ఫిర్యాదు చేయాలని స్వయంగా కలెక్టర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఫిర్యాదుల విషయం బయటకు రావడం లేదు. తాజాగా ఈనెల 13న జరిగిన ప్రజావాణిలో కూడా ఇంకా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. అలాగే కలెక్టరేట్ ఎదుట వివిధ పార్టీల నేతలు ఆందోళన నిర్వహించి అర్హులకు కేటాయించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఎస్‌వీఈపీ యూనిట్ల పరిశీలన



బట్టల దుకాణాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు

అన్నపురెడ్డిపల్లి: స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ (ఎస్‌వీఈపీ) కింద మహిళా సంఘాలలోని సభ్యులకు మంజూరు చేసిన యూనిట్లను కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంట, రాజాపురం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో నెలకొల్పిన యూనిట్లను ప్రతినిధులు సుందర్‌రాజ్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుంకరి సత్యం పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్థిరత్వం సాధించాలని సూచించారు. ఎస్‌వీఈపీ పథకం ఒంటరి మహిళలకు, వితంతువులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీపీఎం ప్రసాద్‌రెడ్డి, ఏపీఎం రాంభద్రయ్య, సీసీలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

హోటల్, కిరాణా దుకాణం దగ్ధం



దగ్ధమైన హోటల్, కిరాణా దుకాణం

చండ్రుగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పక్కపక్కనే ఉన్న హోటల్‌తోపాటు కిరాణా షాపు అగ్నికి ఆహుతయ్యాయి. హోటల్‌తో పాటు సామగ్రి, కిరాణా షాపులోని ఫ్రిజ్ కాలిపోయాయి. రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు హోటల్ యజమాని రాంబాబు తెలిపాడు. కిరాణా షాపులో రూ.లక్షన్నర వరకు ఆస్తినష్టం జరిగినట్లు యజమాని వేముల త్రిమూర్తులు చెప్పాడు. అగ్నిప్రమాదంపై ఇద్దరు యజమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ విజయలక్ష్మి మంగళవారం సందర్శించారు.

నిప్పంటుకుని కాలిపోయిన చెట్లు



తోటలో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

పాల్వంచరూరల్: అగ్గి రాజుకోవడంతో అటవీ శాఖకు చెందిన జామాయిల్ తోటలోని మొక్కలు, పక్కనే ఉన్న పల్లెప్రకృతి వనంలోని పూల మొక్కలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. మండలంలోని సూరారం గ్రామపంచాయతీ నర్సమ్మతల్లి గుడి సమీపాన జామాయిల్ తోటలో మంగళవారం ఆకతాయిలు నిప్పంటించడంతో ఎండుటాకులు అంటుకుని మొక్కలు కాలిపోయాయి. అలాగే, పక్కనే ఉన్న సూరారం జీపీ పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు కూడా నిప్పంటుకుంది. కాగా, సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు.

అమెర్దలో జ్వరాలు తగ్గేవరకు శిబిరం



నీటి నిల్వలను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్

అశ్వాపురం: మండలంలోని అమెర్ద గ్రామ పంచాయతీలో జ్వరాలు తగ్గే వరకు వైద్యశిబిరం నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమెర్ద గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. వైద్యాధికారి సంకీర్తన, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాల విషయంలో ఎవరూ భయపడొద్దని, తీవ్రత తగ్గేవరకు గ్రామంలో వైద్యశిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. జ్వరంఉన్న ప్రతి ఒక్కరూ రక్త నమూనాలు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది గొంది వెంకటేశ్వర్లు, సంకీర్తన, కృష్ణయ్య, కాంతమ్మ, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల విధ్వంసం

చర్ల: ఇసుక రవాణా చేస్తున్న నాలుగు వాహనాలను మావోయిస్టులు దగ్ధం చేసిన ఘటన మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లాలోని నైమేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండేపాల్ సమీపంలో నది నుంచి ఇసుక తరలిస్తుండగా అక్కడికి చేరుకున్న మావోయిస్టులు రెండు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను దగ్ధంచేశారు. వివరాలు బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని అక్కడున్న డ్రైవర్లు, కూలీలను తీవ్రంగా హెచ్చరించారని సమాచారం.

పట్టుకున్నారు... పట్టింపేది?

- బంధించింది 19 కుక్కలనే
- సరైన ఆహారం లేక అల్లాడుతున్న మూగజీవులు
- రిమార్క్ లిస్టులో ఉన్నవారికే బాధ్యత
- అసహనం వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు



రైటర్‌బస్తీలోని ఏబీసీ సెంటర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్ర మున్సిపాలిటీలోని వీధుల్లో గ్రామసింహాల సంచారం ఇంకా కొనసాగుతునే ఉంది. ఈనెల 6వ తేదీన 'సాక్షి'దినపత్రికలో 'బయటకొస్తే భయమే 'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి.. మరుసటి రోజు నుంచి పట్టణంలో కుక్కలను పట్టుకునే పనిలో పడ్డారు. దీనికోసం మున్సిపాలిటీ అధికారులు ఓ ప్రైవేట్ ఏజెన్సీ వారికి అప్పగించారు. కానీ వారికి కుక్కలను పట్టుకునే విధానం తెలియక ఇప్పటి వరకు కేవలం 19 కుక్కలను మాత్రమే పట్టి కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఏనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్‌కు తరలించారు. కాగా, ఆ సెంటర్‌లో మూగజీవులను చిన్నచిన్న గదుల్లో పెట్టి తాళం వేశారు. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసేంత వరకైనా వాటికి కనీస ఆహారం, నీటిని అందించాల్సి ఉంటుంది. కానీ, ఆ మూగ జీవులకు పాడైన అన్నం పెట్టడం వల్ల అవి అన్నం తినడం లేదు. దీంతో ఆ గదుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయి.

అయినా అప్పగింత..

కుక్కలు మామూలుగా వీధుల్లో తిరిగే సమయాల్లో ఆకలి వేసినప్పుడు, ఏమీ దొరకని సమయంలో మనుషులపై ఎగబడే సంఘటనలు అనేకం ఉన్నాయి. కానీ, కుక్కలను వ్యాక్సినేషన్ కోసం ఏబీసీ సెంటర్‌కు తరలించి సరైన ఆహారం పెట్టకపోవడం వల్ల అవి వీధుల్లోకి వదిలినప్పుడు మనుషులపై మరింతగా దాడులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే గోదావరిఖని, హైదరాబాద్ వంటి ఏరియాల్లో రిమార్క్ ఉన్న ఏజెన్సీకి కొత్తగూడెం మున్సిపల్ అధికారులు అప్పగించడంతో కుక్కల రక్షణను వదిలివేసి, ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నరని ఏబీసీ సెంటర్ సమీపంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. అన్నింటిపై అవగాహన, పని తెలిసిన ఏజెన్సీకి పనులు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతా గోప్యంగా..

ఏబీసీ సెంటర్‌లో జరిగే వ్యవహారమంతా గోప్యంగా ఉంచేందుకు అక్కడకు ఎవరూ రావడానికి వీలు లేదని, ఏజెన్సీ వారు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. ఈ నేపథ్యంలో సదరు ప్రైవేట్ వ్యక్తి అక్కడికి వచ్చిపోయే వారిని భయాభ్రాంతులకు గురిచేస్తుండడం గమనార్హం. కుక్కలను పట్టలేదు అనకుండా.. 36 వార్డుల్లో కేవలం 19 కుక్కలను పట్టుకొని ఏజెన్సీ, మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

- నిబంధనలు పాటించకుండా పలు వీధి కుక్కల మరణాలకు కారణమైన ఏజెన్సీలకే మళ్లీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కాంట్రాక్టు అప్పగిస్తున్న మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెంలో జరుగుతున్న తీరు అన్ని ప్రాంతాల్లో జరిగితే అంతరించిపోతున్న జంతువుల లిస్టులో కుక్కలు సైతం చేరుతాయి.
- గత జనవరి 4న ఏబీసీ సెంటర్‌లో రూల్స్ పాటించడం లేదని జంతు ప్రేమికులు, హెల్ప్ ఫర్ ఏనిమల్స్ గ్రూప్ చైర్మన్ మేనకాగాంధీ చొరవతో కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు నీరు, ఆహారం అందించడంలో ఏజెన్సీ విఫలం చెందిందని ఏబీసీ సెంటర్ మూత పడింది.



పాడైన అన్నం

అంతా సవ్యంగానే ఉంది..



కొత్తగూడెం రైటర్ బస్తీలోని ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో అంతా సవ్యంగానే జరుగుతుంది. పట్టుకున్న కుక్కలకు ఏజెన్సీ వారు అన్నం, నీరు అందిస్తున్నారు. కుక్కలకు ఆపరేషన్ ముందు పాటించాల్సిన అన్ని నియమ, నిబంధనలు ఏజెన్సీ వారు పాటిస్తున్నారు.

– జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

అవగాహన కల్పించాలి..



భూమిపై ప్రతి జంతువు మనుగడ అవసరముంటుంది. కుక్కలకు ఆకలి అయినప్పుడు మాత్రమే కరుస్తుంటాయి కాబట్టి పలు చోట్ల నీటి సౌకర్యం కల్పించాలి. మున్సిపల్ అధికారులతో పాటు పోలీసులు, ఇతర డిపార్టుమెంట్ అధికారులు జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి.

– కట్కకం యామిని లక్ష్మి, జంతు ప్రేమికురాలు

భూసార యాజమాన్యంతో సుస్థిర దిగుబడి



మాట్లాడుతున్న సయ్యద్ అహ్మద్‌హుస్సేన్

అశ్వారావుపేట: సరైన భూసార యాజమాన్యంతో పంటల్లో సుస్థిరమైన దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్‌హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో 'సుస్థిర దిగుబడికి భూసార యాజమాన్యం'అనే అంశంపై మంగళవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేల ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అందుకోసం ప్రతిఒక్కరూ తమవంతుగా కృషి చేయాలన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటంతోపాటు అందుబాటులో ఉన్న సేంద్రియ పదార్థాలను నేలకు చేర్చడం, జనుము, జీలుగు వంటి పచ్చిరొట్టను సాగు చేసి భూమిలో కలియబెట్టడం, పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నటం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ కాడ సిద్ధప్ప, డాక్టర్ రెడ్డిప్రియ, డాక్టర్ వి.వెంకన్న, డాక్టర్ కె.గోపాలకృష్ణ, డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ జంబమ్మ, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా?

- కూనవరంలో పట్టుబడిన పాల్వంచవాసులు
- ఫర్నిచర్ విక్రయం ముసుగులో దొంగనోట్ల చెలామణి

పాల్వంచ: ఏజెన్సీ ఏరియాలో అమాయకులే టార్గెట్‌గా దొంగనోట్లను మారుస్తున్న పాల్వంచకు చెందిన నలుగురు వ్యక్తులతో కూడిన ముఠాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి జిల్లా కూనవరం పోలీసులు అరెస్ట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ముఠా సభ్యులు ఫర్నిచర్, హోంనీడ్స్, పరుపులు, దుప్పట్లు తదితర వస్తువులను వాయిదాల పద్ధతిలో ఏజెన్సీ ఏరియాల్లో విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో గిరిజనులను టార్గెట్ చేసుకుని దొంగనోట్లను గుట్టుచప్పుడు కాకుండా మారుస్తున్నారు. నకిలీ నోట్లు చలామణీ చేస్తుండగా రెండు రోజుల కిందట అల్లూరి జిల్లా కూనవరం పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి నుంచి భారీగా దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న వారిలో పాల్వంచ తెలంగాణనగర్‌కు చెందిన ఓ వ్యక్తి, ఇందిరాకాలనీకి చెందిన వ్యక్తి, మంచికంటినగర్‌కు చెందిన ఓ వ్యక్తి, భద్రాచలానికి చెందిన మరో వ్యక్తి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందిరాకాలనీకి చెందిన వ్యక్తి, భద్రాచలంలో ఉంటున్న ఇద్దరు సోదరులని సమాచారం. వారు ఎటపాకలో బృందంగా ఏర్పడి దందా సాగిస్తున్నారని, ఇందిరాకాలనీ వాసి కూడా ఇటీవల ఐపీ పెట్టి చింతూరుకు మకాం మార్చినట్లు సమాచారం. త్వరలోనే అక్కడి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో వివరాలు వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలాఉండగా ఇటీవల పెట్రోల్‌బంక్‌లో కూడా ఓ దొంగనోటు రావడం గమనార్హం.

రాత్రి వెళ్తే డబ్బులు వస్తాయి...

- విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

జూలూరుపాడు: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థిని తండ్రి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. జూలూరుపాడు మండలం పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 13న(సోమవారం) గణితం ఉపాధ్యాయుడు పాఠం చెబుతుండగా ఏడో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఒకే పుస్తకం చూస్తున్నారు. ఇదేమిటని ఉపాధ్యాయుడు అడగడంతో బ్యాగ్ చినిగిపోవడంతో అందరం అన్ని పుస్తకాలు తెచ్చుకోలేదని బదులిచ్చారు. బ్యాగ్‌లు కొత్తవి తీసుకోవచ్చుగా అని విద్యార్థినులను ఉపాధ్యాయుడు అడగగా, డబ్బులు లేవని సమాధానం చెప్పారు. దీంతో ఉపాధ్యాయుడు రాత్రి పూట వెళ్తే డబ్బులు వస్తాయని అన్నాడు. ఈ విషయాన్ని ఇంటికి వెళ్లిన విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పగా వారు మంగళవారం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎంఈఓ గుగులోత్ వెంకట్ పాఠశాలకు వెళ్లి వివరాలు ఆరా తీసి డీఈఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఇక ఓ విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. దీనిపై ఎంఈఓ మాట్లాడుతూ.. విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ చెప్పారని వెల్లడించారు.

ఆదివాసీలను నిర్బంధించడం తగదు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చర్ల: మండలంలోని రాజయ్యనగర్‌లో ఆదివాసీ యువకుడు సప్కా రమేశ్ హత్య నేపథ్యంలో అనుమానితులుగా భావిస్తూ చర్ల పోలీసులు అదే గ్రామానికి చెందిన ఏడుగురిని నిర్బంధించారని, ఈ హత్యతో తమకు సంబంధం లేదని చెబుతున్నా నాలుగు రోజులుగా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచడం సరికాదని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేడ్కర్ సెంటర్లో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ రమేశ్ హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీలను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పోలీసులు ఈ కేసు విషయంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలైన దోషులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.శివ, రాజయ్యనగర్ గ్రామస్తులు రమేశ్, జోగయ్య, భీమాలు, రాజు, ఇడమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావుకు ప్రముఖులు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఎంపీ బుధవారం పుట్టిన రోజు జరుపుకోనుండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ప్రత్యేక సందేశం పంపించారు. అలాగే, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

హత్యకేసులో వ్యక్తికి జీవితఖైదు

సింగరేణి(కొత్తగూడెం): హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర్ ప్రసాద్ మంగళవారం తీర్పు చెప్పారు. చర్ల మండలం పెద్దమిడిసిలేరు పరిధి కాలువగుంపు గ్రామానికి చెందిన సోయం నర్సమ్మ భర్త సోయం కామయ్య (56) జూన్ 6, 2022న మద్యం సేవించేందుకు బయటకువెళ్లాడు. ఆయనను తీసుకొచ్చేందుకు నర్సమ్మ తన కూతురును పంపించగా కామయ్య తన సోదరుడు నర్సింహారావుతో మాట్లాడుతుండటంతో తిరిగి ఇంటికి వచ్చింది. అనంతరం తన భర్త శరీరమంతా తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి చనిపోగా పోలీసులకు నర్సమ్మ ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ అశోక్ దర్యాప్తు చేశారు. పెద్దమిడిసిలేరు గ్రామానికి చెందిన సోడి పాపారావు.. తన భార్యకు చేతబడి చేసి కామయ్యే చంపాడని భావించి హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం సోడి పాపారావుపై నేరం రుజువైనందున జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి వాదించారు. ఎన్.వీరబాబు, జి.సైదులు సహకరించారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత



పట్టుబడిన వాహనంతో పోలీసులు

చండ్రుగొండ : అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని లంకలవాగు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పశువుల లోడుతో వెళ్తున్న బొలేరోను సీజ్ చేశారు. విశాఖపట్నం నుంచి సూర్యాపేటకు అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంలోని ఎనిమిది పశువులను పాల్వంచ గోశాలకు తరలించామని,ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

డయల్ 100 ట్యాబ్‌లు పనిచేయకపోవడంపై ఆరా!

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: పోలీస్ శాఖకు చెందిన డయల్ 100 ట్యాబ్‌లు సక్రమంగా పనిచేయని విషయంపై పోలీస్ జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీశారు. జిల్లాలో డయల్-100 కాల్‌కి ఫిర్యాదుదారులు ఫోన్ చేసినా సకాలంలో అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని, పోలీస్ స్టేషన్‌లో ఉండే ట్యాబ్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో మంగళవారం సాక్షి 'డయల్ 100.. వెరీ స్లో'అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో జిల్లా పోలీస్ అధికారి (డీపీఓ) కార్యాలయం నుంచి ఐటీ కోర్ సిబ్బంది జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌ల నుంచి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం . ఎక్కడెక్కడ ఎన్ని ట్యాబ్‌లు ఉన్నాయి? వాటి పనితీరు, సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు. అయితే, హైదరాబాద్ డీజీ కంట్రోల్ ఆఫీస్ నుంచే ఆలస్యంగా సమాచారం వస్తోందని ఐటీ కోర్ సిబ్బంది స్పష్టం చేసినట్లు తెలిసింది.

పొంగులేటి సునామీలో డకౌట్ ఖాయం

- సత్తుపల్లి సభతో వారికి నిద్ర పట్టడం లేదు
- విలేకరుల సమావేశంలో శ్రీనివాసరెడ్డి వర్గం నేతలు



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ విజయ్‌బాబు, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే ఎన్నికల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సునామీలో బీఆర్‌ఎస్ పార్టీ డకౌట్ ఖాయమని.. ఆ పార్టీ జిల్లాలో ఒక్క సీటూ గెలుచుకోలేదని డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మువ్వా విజయ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి అన్నారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సత్తుపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి భారీగా జనం హాజరుకావడంతో ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు నిద్రపట్టడం లేదన్నారు. కాగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఉన్న స్పష్టమైన అజెండా ఆధారంగా పది నియోజకవర్గాల్లో జనం ముందుకు వెళ్తామని తెలిపారు. అన్ని నియోజకవర్గాలతోపాటు పాలేరులో కూడా అభ్యర్థిని ప్రకటిస్తారని చెప్పారు. కాగా, పొంగులేటిపై ఎమ్మెల్యే సండ్ర వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, త్వరలోనే ఆయన అక్రమాల చిట్టాను బయటపెడతామని పేర్కొన్నారు. సీపీఎం నుంచి టీడీపీలోకి, అక్కడి నుంచి బీఆర్‌ఎస్‌కు వచ్చిన ఆయన ఈ పార్టీలోనూ కూడా చివరి వరకు ఉంటారని గ్యారెంటీ లేదని తెలిపారు. ఎన్నెస్పీ భూమిని కారు చౌకగా తీసుకుని బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం అందరికీ తెలుసని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తయితే రైతులకు లాభం జరుగుతుందనే కోణంలో పొంగులేటి మాట్లాడితే తప్పు పట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. మంత్రి పువ్వాడకు తెలియకుండానే ఖమ్మంలో అవినీతి జరుగుతోందని, భూ కబ్జాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రజలకు మాట్లాడే హక్కు.. ప్రశ్నించే హక్కు లేనట్లుగా బీఆర్‌ఎస్ నేతలు వ్యవహార తీరు ఉందని విమర్శించారు. ఇంకా ఈ సమావేశంలో కార్పొరేటర్ మలీదు జగన్, నాయకులు మేకల మల్లిబాబుయాదవ్, కోటా రాంబాబు, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య వాగ్వాదం

తారాస్థాయికి చేరిన ప్రొటోకాల్ రగడ



రెండు వర్గాల మధ్య వాగ్వాదం దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. భట్టివిక్రమార్క వర్గంగా చెప్పుకుని, పనిచేస్తున్న టీపీసీసీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ జి.రవి అనుచరులతో కలిసి ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న పట్టణ అధ్యక్షుడు డానియేల్ ఆధ్వర్యంలో నాయకులు వచ్చి ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చిలికిచిలికి గాలివానలా తయారైంది. డాక్టర్ జి.రవి ప్రొటోకాల్ పాటించకుడా వార్డుల్లో 'హాత్ సే హాత్ జోడో యాత్ర' నిర్వహించారని, కనీస సమాచారం కూడా ఇవ్వలేదని పట్టణ అధ్యక్షుడు డానియేల్ చెబుతున్నారు. ప్రెస్‌మీట్‌ను అడ్డుకోవడం తగదని, టీపీసీసీ కోఆప్షన్ సభ్యుడిగా తనకు పదవి ఉందని డాక్టర్ జి.రవి పేర్కొంటున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి..

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని, ఇల్లెందు నియోజకవర్గం నుంచి అత్యధికంగా తరలివెళ్లాలని టీపీసీసీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ జి.రవి కోరారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయం గేట్ బయట మీడియాతో మాట్లాడుతూ భట్టి విక్రమార్క పాదయాత్ర విజయవంతం చేయాలనే సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

పుటానీతండాలో భయం.. భయం

కుక్కకాటుతో మృతి చెందిన బాలుడి కుటుంబానికి పరామర్శ



భరత్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి, తదితరులు

రఘునాథపాలెం: కుక్కకాటుకు గురై రేబిస్ లక్షణాలతో రఘునాథపాలెం మండలం పుటానీతండాకు చెందిన బాలుడు బానోత్ భరత్(5) ఆదివారం సాయంత్రం మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు ఆయన కుటుంబాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, మంచుకొండ వైద్యాధికారి కె.సంధ్యారాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పరామర్శించారు. నెలల క్రితమే భరత్‌ను కుక్క కాటు వేసి ఉంటుందని, సరైన చికిత్స చేయించకపోవడంతో రేబిస్ ప్రభావంతో మృతి చెంది ఉండొచ్చని డీఎంహెచ్‌ఓ అభిప్రాయపడ్డారు. కాగా, రేబిస్ లక్షణాలతో బాధపడిన భరత్ తల్లిదండ్రులు, స్నేహితులతో గడిపిన సమయాన వారిని గీరినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రులకు తీసుకెళ్లిన సమయంలో తల్లిదండ్రులను, ఆడుకునే సమయంలో స్నేహితులను గీరి ఉంటాడని, తద్వారా వారికి కూడా గాట్లు పడి ఉండొచ్చని తెలుస్తోంది. దీంతో అధికారుల సూచన మేరకు అనుమానం ఉన్న వారంతా వ్యాక్సిన్ కోసం ఆస్పత్రికి వెళ్లారు. మంగళవారం ఒకేరోజు మంచుకొండ పీహెచ్‌సీలో 30 మంది వ్యాక్సిన్ ఇవ్వగా, బాలుడితో సన్నిహితంగా మెదిలిన వారిని జిల్లా ఆస్పత్రికి పంపించినట్లు డాక్టర్ సంధ్యారాణి తెలిపారు. కాగా, బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తేజావత్ కృష్ణకాంత్, గుగులోత్ హరినాయక్, బానోతు నాగేశ్వరరావు, భూక్యా బాలాజీ, బానోత్ కోక్యానాయక్, మూడ్ చిన్న, శంకర్, బానోతు సోమ్లా, బానోతు రమేష్ ఉన్నారు.

ప్రగతిభవన్‌లో నీటిపారుదల శాఖ బందీ: పొంగులేటి

బోనకల్: నీటిపారుదల శాఖ ప్రగతిభవన్‌లో బందీగా మారిందని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ఆళ్లపాడులో బోనకల్ బ్రాంచ్ కెనాల్ (బీబీసీ) కింద సాగర్ జలాలు అందక ఎండిపోతున్న మొక్కజొన్న, మిర్చి, వరి పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. వర్షాలు పుష్కలంగా కురిసి సాగర్ నిండా నీరున్నా అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల వైఫల్యంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని పొంగులేటి అన్నారు. బోనకల్ మండలంలోనే 500 ఎకరాల మేర పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఆరు తడి పంటలకు కూడా నీరు ఇవ్వలేనందుకు రాష్ట్రప్రభుత్వం సిగ్గుపడాలని దుయ్యబట్టారు. ఆళ్లపాడులో సర్పంచ్ మర్రి తిరుపతిరావు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేసినా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల వైఫల్యానికి నిదర్శనమని పొంగులేటి విమర్శించారు. ప్రజల్లో తిరిగే వారికి ఇరిగేషన్ శాఖ మంత్రి పదవి ఇచ్చి ఉంటే రైతులు తమ గోడును చెప్పుకునేవారని అభిప్రాయపడ్డారు.

ముగ్గురు లైన్‌మన్‌లకు సీఈఏ పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్)కు చెందిన ముగ్గురు లైన్‌మన్‌లకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఉత్తమ సేవా పురస్కారాలను ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్ల లైన్‌మన్లు కె.ఈశ్వర్ రెడ్డి, డి.మల్లారెడ్డి, కొండూరు యాదయ్యకు పతకం, ప్రశంస పత్రాన్ని అందజేసింది. పురస్కారాలు అందుకున్న లైన్‌మన్‌లు మంగళవారం టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, డైరెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు.

రేవంత్‌ది కాంగ్రెస్‌కు పాడెకట్టే యాత్ర: గ్యాదరి కిశోర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్నది కాంగ్రెస్‌కు పాడె కట్టే యాత్ర తప్ప పాదయాత్ర కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఎద్దేవాచేశారు. చంద్రబాబు సంకలో చేరి తెలంగాణకు అన్యాయం చేయడానికి కారణమైన రేవంత్ అమరవీరుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వారు అమరులు కావడానికి కారణమే రేవంత్ అని ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌లతో కలిసి బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌పై కానీ బీఆర్ఎస్‌పై కానీ తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే రేవంత్‌రెడ్డిని బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. రేవంత్ వృత్తి బ్లాక్ మెయిలర్ అని విరుచుకుపడ్డారు. సమాచార హక్కు చట్టాన్ని బ్లాక్ మెయిలింగ్‌కు వాడుకునే రేవంత్, ఇప్పుడు కూడా వీటిపై సమాచారం తీసుకోవచ్చని హితవు పలికారు.

నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్

దేశానికి రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది

- ఆ నిర్ణయంపై మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నోట్ల రద్దు తరువాత నకిలీ కరెన్సీ, నల్లధనం పెరిగాయి
- ప్రధానిపై నమ్మకంతోనే గతంలో నోట్ల రద్దును సమర్థించాం
- కానీ చెప్పిన లక్ష్యాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయిందని... ఈ నిర్ణయం వల్ల దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నోట్ల రద్దుతో నకిలీ కరెన్సీ తగ్గకపోగా 54 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయన్నారు. పెద్ద నోట్ల రద్దు, దాని పర్యవసానాలపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా శ్వేతపత్రం విడుదల చేయాలని చెప్పారు. బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కృష్ణమోహన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు దండే విఠల్, దేశపతి శ్రీనివాస్‌లతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు విఫలమని కేంద్రమే అంగీకరించిందన్నారు. బీజేపీ చెప్పేదొకటి.. చేసేదొకటి అనేందుకు పెద్దనోట్ల రద్దు నిర్ణయమే ఉదాహరణని ఎద్దేవా చేశారు. ప్రధానిపై నమ్మకంతో అప్పట్లో నోట్ల రద్దు నిర్ణయాన్ని తాము సమర్థించామని, అయితే చెప్పిన లక్ష్యం ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. ఏ ప్రణాళిక, ఆలోచన లేకుండా ప్రధాని పెద్ద నోట్లను రద్దు



చేశారని... ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

నగదు చెలామణి పెరిగింది..

పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ కాబట్టే దీనిపై బీజేపీ నేతలు మాట్లాడటం లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. చెలామణిలో ఉన్న నగదుపై కేంద్రం చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆయన విమర్శించారు. 2014కు ముందు దేశ జీడీపీలో 11 శాతం నగదు ఉండేదని, అదిప్పుడు 13 శాతానికి పెరిగిందన్నారు. అలాగే గతంతో పోలిస్తే పెద్ద నోట్ల వాడకం రెట్టింపయ్యిందని చెప్పారు. రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేసి తెచ్చిన రూ. 2 వేల నోటు వల్ల పెద్ద నోట్ల వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. కొత్త నోట్ల ముద్రణకు మోదీ ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు ఖర్చు పెట్టిందని... ఈ మొత్తంతో ఒక ప్రాజెక్టు పూర్తయి ఉండేదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పట్టుకున్న నల్లధనమే రూ. 40 వేల కోట్లు..

పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం ఉండదని చెప్పిన ప్రధాని మాటలు అపహాస్యమయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు. 592 కేసుల్లో రూ. 40 వేల కోట్ల నల్లధనం పట్టుకున్నారని చెప్పారు. బీజేపీ వేసే ప్రతి అడుగు పేదలపై పిడుగులా మారిందని, నీతి ఆయోగ్ నేతి బీరకాయలో నెయ్యి చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అప్పులు చేయడం.. తప్పులు చేయడం బీజేపీ విధానంగా మారిందని, కేంద్రం ప్రతిరోజూ చేస్తున్న అప్పు రూ. 4,618 కోట్లని ఆయన పేర్కొన్నారు. మోదీ హయాంలో రూ. కోటీ ఏడు లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. పెద్ద నోట్ల మార్పు కోసం క్యూలలో నిలబడి 108 మంది మరణించారని, నోట్ల రద్దు కారణంగా 62 లక్షల మంది ఉపాధి కోల్పోయారన్నారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో రూ. 100 లక్షల కోట్లు అప్పు చేసిందని, దేశంలో అవినీతి, ఆకలి పెరిగిపోతోందని పేర్కొన్నారు. నోట్ల రద్దుతో 50 రోజుల్లో అంతా బాగుంటుందని భరోసా ఇచ్చిన పెద్దలు... ఇప్పుడు 2 వేల రోజులైనా ఏం మార్పు తెచ్చారని హరీశ్ ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ధరలు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు.

కాళేశ్వరంలో అవినీతిపై విచారణ జరపాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైఎస్ షర్మిల
- పార్లమెంట్ ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



ఢిల్లీలో వైఎస్ షర్మిలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలిస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: గతంలో బయటపడ్డ 2 జీ, బొగ్గు కుంభకోణాల కంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో భారీగా అవినీతి జరిగిందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కాళేశ్వరం కోసం రూ.1.20 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని...అందులో వేలాది కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దోచుకున్నారని షర్మిల మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా వైఎస్సార్‌టీపీ మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో షర్మిల పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి పార్లమెంట్ ముట్టడికి బయల్దేరే ప్రయత్నం చేయగా జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు షర్మిలతో పాటు కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒక గంట తర్వాత విడుదల చేశారు.

ఎమ్మెల్యే లింగయ్యపై చర్యకు వినతి

సాక్షి, హైదరాబాద్ : మహిళలను కించపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చర్య తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి బీజేపీ మహిళా మోర్చా విజ్ఞప్తి చేసింది. బీజేపీ నాయకుల భార్యలను బీఆర్ఎస్ నేతలు ముద్దు పెట్టుకుంటారని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే లింగయ్యపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్‌కు మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి ఆధ్వర్యంలో కల్యాణం గీతారాణి, శ్యామల, డాక్టర్ మాలతీలత ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేకు బెదిరింపు కాల్స్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు వెంటనే క్షమాపణ చెప్పకపోతే అంతు చూస్తామని మూడు రోజులుగా ఫోన్‌లో వరస బెదిరింపులు వస్తున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మరోవైపు.. మహిళా కమిషన్ అధికారులు లింగయ్యకు ఫోన్ చేసి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై వివరణ కోరారు.

రూ.300 కోట్ల ప్రాజెక్టుకు.. రూ.3,500 కోట్లు

- కమీషన్ల కోసమే మంచిప్ప ప్రాజెక్టుకు రీడిజైన్లు : రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జలయజ్ఞంలో భాగంగా నాడు చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం రీడిజైన్లు చేసిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 20, 21, 22 ప్యాకేజీల కింద చేపట్టిన మంచిప్ప జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 0.84 టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండెం చెరువు పనులను రూ.900 కోట్లతో 75 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. తక్కువ ముంపుతోనే 1.84 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు డిజైన్ చేశారని గుర్తు చేశారు. ఇంకా రూ.300 కోట్లు ఖర్చు చేస్తే జలాశయం పనులు పూర్తయి పొలాలకు నీరందుతుందని చెప్పారు. అయితే కేవలం కమీషన్లు దండుకునేందుకే సీఎం కేసీఆర్ 3.5 టీఎంసీలకు సామర్థ్యం పెంచి 10 గ్రామాలను, 10 వేల ఎకరాలను ముంచుతున్నారని నిందించారు. రూ.3,500 కోట్లు వెచ్చించి దోపిడీ చేసేందుకే డిజైన్లు మార్చారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు బలైందని రేవంత్ ధ్వజమెత్తారు. భూములు కోల్పోతున్న రైతులు ప్రశ్నిస్తే, 17మంది హత్యాయత్నం కేసులు నమోదు చేయించడం, ప్రజాభిప్రాయం లేకుండా డిజైన్లు మార్చడం దుర్మార్గమన్నారు. రైతులపై కేసులు బనాయించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే గ్రామాల పొలిమేరల్లోంచే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బాజిరెడ్డి గ్రామాల్లోకి రావద్దని బోర్డులు పెట్టాలని, అయినా వస్తే కళ్లల్లో కారం కొట్టి, కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. రైతుల భూముల జోలికొస్తే రాజకీయంగా సమాధి చేయాలన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం చేస్తామన్నారు.



మంచిప్ప వద్ద కాళేశ్వరం 21 ప్యాకేజీ పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

పేపర్ లీకేజీలో కేసీఆర్ ఫ్యామిలీ పాత్ర

సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయించాలి: రేవంత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో రేవంత్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పోస్టుల పరీక్ష పేపర్ల లీకేజీలో కేసీఆర్ కుటుంబ సభ్యులు, కొందరు ఎమ్మెల్యేల పాత్ర ఉందని ఆరోపించారు. పేపర్ లీక్ అని, సైట్ హ్యాక్ అయిందని, హనీట్రాప్ అని మూడు రకాలుగా చెప్పడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శికి మాత్రమే తెలియాల్సిన పాస్‌వర్డ్ ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎలా తెలిసిందని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం స్ట్రాంగ్ రూమ్‌లోకి చైర్మన్, కార్యదర్శికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ప్రవీణ్ అనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎలా ప్రవేశించాడని, అతనికి పాస్‌వర్డ్ ఎలా తెలిసిందని రేవంత్ నిలదీశారు. కేసీఆర్ హయాంలో జరిగిన ప్రతి పోటీ పరీక్షపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రేవంత్ డిమాండ్ చేశారు.

బహిరంగ సభలకు అధిష్టానం పెద్దలు హాజరయ్యేలా చూడండి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కోరిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- 91 రోజుల పాదయాత్రలో మూడు బహిరంగ సభలకు అధిష్టాన పెద్దలకు ఆహ్వానం
- రాష్ట్రంలోని పార్టీ వ్యవహారాలపైనా చర్చ



సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన నివాసంలో కలిసిన భట్టి, ఈ నెల 16న బోథ్ నియోజకవర్గం బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రారంభం కానున్న 'హాథ్ సే హాథ్ జోడో'పాదయాత్రకు అధిష్టానం అనుమతి కోరారు. పాదయాత్రకు సంబంధించి ఢిల్లీ నుంచి ఒక ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో పార్టీకి సంబంధించిన తాజా వ్యవహారాలను, పార్టీ సీనియర్ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావు థాక్రేకు రాసిన ఫిర్యాదు లేఖ అంశాన్ని ఖర్గేకు వివరించారు.

16 నుంచి 1,365 కిలోమీటర్ల పాదయాత్ర

భట్టి చేపట్టనున్న పాదయాత్ర మార్చి 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై జూన్ 15 వరకు మొత్తం 91 రోజుల పాటు 39 నియోజకవర్గాల మీదుగా మొత్తం 1,365 కి.మీ. కొనసాగనుంది. పాదయాత్ర ఏప్రిల్ మొదటివారానికి మంచిర్యాలకు చేరనుండగా..అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు చెందిన ఒక సీఎం హాజరుకావాలని అధిష్టానానికి భట్టి విజ్ఞప్తి చేశారు. శేర్ లింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించే సభకు ఏఐసీసీ ముఖ్యనేతలు, యాత్ర ముగింపు సందర్భంగా జూన్ 15న ఖమ్మంలోజరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర సీఎం తోపాటు ప్రియాంక లేదా రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యేలా చూడాలని భట్టి కోరారు.

జాతీయ క్రికెట్ జట్టులో ఇద్దరికి స్థానం



వినోద



మమత

ఖమ్మం స్పోర్ట్స్: నేపాల్ క్రికెట్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈనెల 18నుంచి జరిగే అంతర్జాతీయ ఇన్విటేషన్ మహిళా టీ-20 క్రికెట్ టోర్నీకి జాతీయ జట్టును ఇటీవల ఎంపిక చేశారు. ఈ జట్టులో జిల్లాలోని కల్లూరు మండలం కోర్లగూడెంకు చెందిన చాట్ల మమత, కూసుమంచి మండలం గంగబండ తండాకు చెందిన వడిత్య వినోదకు స్థానం దక్కింది. వీరిని టీ-20 మహిళా క్రికెట్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కూరపాటి ప్రదీప్, కార్యదర్శి ఎం.డీ.మతిన్‌తో పాటు శివ, వీర్ల రవి, వెంకటప్రసాద్ తదితరులు అభినందించారు.

ఇంటర్ విద్యార్థులకు రవాణా సౌకర్యం

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకులాల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, సుదిమళ్ల, దమ్మపేట, గుండాల, ఖమ్మం, అన్నపురెడ్డిపల్లి, మణుగూరు, కొత్తగూడెం, సింగరేణి, తిరుమలాయపాలెం, అంకంపాలెం, కృష్ణసాగర్, గండుగులపల్లిలోని విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లివచ్చేలా బస్సులు, ఆటోలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు పీఓ వెల్లడించారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కానుండగా.. ప్రశాంతంగా, పకడ్బందీగా సాగేలా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని కళాశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశమై సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వహించడమే కాక కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8–45 గంటల్లో చేరుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లా వార్తలు

మెరిసిన మిర్చి ధర



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.21,800
- ప్రస్తుత సీజన్‌లో ఇదే రికార్డు ధర
- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న డిమాండ్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం తేజా రకం మిర్చి క్వింటాకు ధర రూ.21,800గా నమోదైంది. సోమవారం రూ.21,600గా ఉన్న ధర ఒకే రోజులో రూ.200 మేర పెరగడం విశేషం. ప్రస్తుత సీజన్‌తో పాటు పంట సీజన్లలో దేశంలోనే ఈ ధర అత్యధికమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తగ్గటం, తెగుళ్ల కారణంగా దిగుబడి పడిపోవడంతో మిర్చి ధరకు రెక్కలొస్తున్నాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా జెండా పాటలో కొందరు వ్యాపారులే పాల్గొని గరిష్ట ధర నిర్ణయిస్తారు. కానీ ప్రస్తుతం జాతీయంగా, అంతర్జాతీయంగా మిర్చికి డిమాండ్ పెరగటంతో వ్యాపారులు పెద్దసంఖ్యలో పోటీ పడుతున్నారు. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. సోమవారం రూ.21,600గా ధర పలకడంతో మంగళవారం సైతం అదే ధర ఉంటుందని భావించగా మరింత పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా, కారేపల్లి మండలం మొట్లగూడెంకు చెందిన పొడెం బిక్షపతి తీసుకువచ్చిన 22 బస్తాల మిర్చికి అత్యధిక ధర లభించడంతో రైతుతో పాటు ఖరీదుదారులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సన్మానించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు జీ.వై.నరేష్, అనుబంధ సంఘాల బాధ్యులు మాటేటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి సతీష్, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం ఖమ్మం మార్కెట్‌కు 33,963 బస్తాల మిర్చి విక్రయానికి రాగా మోడల్ ధర రూ.20 వేలుగా, కనిష్ట ధర రూ.17 వేలుగా పలికింది. ఇక తాలు మిర్చికి గరిష్టంగా రూ. 13,800, కనిష్టంగా రూ.7,500 వేల ధర నమోదైంది.

దేశ, విదేశాల నుంచి ఆర్డర్లు

తేజా రకం మిర్చి ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో డిమాండ్ పెరగడంతో ఆర్డర్లు పైపైకి వెళ్తున్నాయి. ఫలితంగా ధర పెరుగుతోందని తెలుస్తోంది. ఇతర రకాలతో పోలిస్తే తేజా రకం మిర్చికి ఘాటెక్కువ కావడం, ఈ మిర్చి నుంచి తీసే పౌడర్, నూనెను విదేశాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుండడంతో ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రధానంగా చైనా నుంచి ఎగుమతిదారులకు ఆర్డర్లు వస్తుండగా, వ్యాపారులు పోటీ పడి ధర పెంచుతున్నారు.

నిర్లక్ష్యంతోనే నీటి వృథా

- అధికారులను మందలించిన ఈఎన్‌సీ నాగేందర్‌రావు
- కొణిజర్ల, బోనకల్ మండలాల్లో పర్యటన



కొణిజర్ల : రాపల్లె మేజర్ వద్ద కాల్వ వద్ద మాట్లాడుతున్న ఈఎన్‌సీ నాగేందర్‌రావు

ఖమ్మంఅర్బన్: వచ్చే నీరు వృథా కాకుండా చూడాల్సిన ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. లాక్‌ల వద్ద లీకేజీలను అరికట్టడంపై దృష్టి సారించడం లేదు.. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి వస్తోంది.. అని జలవనరుల శాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు జిల్లా అధికారులను మందలించినట్లు తెలిసింది. పాలేరు, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సోమవారం పర్యటించిన ఆయన, మంగళవారం ఖమ్మం, సూర్యాపేట సీఈలు శంకర్‌నాయక్, రమేష్‌బాబుతో కలిసి జిల్లాలోని వీ.వీ.పాలెం వద్ద లాక్‌లతో పాటు కొణిజర్ల, బోనకల్ మండలాల్లో కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల కాల్వల ద్వారా నీరు వృథాగా పోతుండడాన్ని గుర్తించిన ఆయన ఇంజనీర్లను పనితీరును తప్పుపట్టినట్లు సమాచారం.

చివరి భూములు ఎండిపోకుండా చర్యలు

కొణిజర్ల/బోనకల్: సాగర్ జలాలు వృథా అవుతున్నా అధికారులు ఉదాసీనంగా ఉంటే చర్యలు తప్పవని జలవనరులశాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు హెచ్చరించారు. కొణిజర్ల మండలంలోని బోనకల్ బ్రాంచ్ కాల్వ, బోనకల్ మండలంలోని బీబీసీని సీఈలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాల్వ నీటి దుర్వినియోగాన్ని గుర్తించినట్లు తెలిసింది. బీబీసీ చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, ఆయకట్టు ఆరంభ రైతులు రెండు, మూడు తడులు పెట్టుకోకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్ఈలు నరసింగరావు, ఆనంద్‌కుమార్, ఈఈలు శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, డీఈలు గౌతమి, శిల్ప, శ్రీనివాస్, రాంప్రసాద్, జేఈ మనోజ, హరికృష్ణ, సురేష్, రాజేశ్, సిబ్బంది కొత్తపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా స్థాయి పోటీల్లో కాంస్య పతకం



క్రీడాకారిణి బుజ్జిని అభినందిస్తున్న జీఎం బసవయ్య, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ డబ్ల్యూపీఎస్ జీఏ ఆధ్వర్యాన నిర్వహించిన నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్(ఎన్‌సీఎల్) కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో రమావత్ బుజ్జి 50 మీటర్ల పాట్ రేస్‌లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం కొత్తగూడెంలో జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ) కట్టా బసవయ్య అభినందించి రివార్డు చెక్కు అందజేశారు. సింగరేణి అధికారులు కోడూరి శ్రీనివాసరావు, గట్టు స్వామి, సుందర్‌రాజు, పాసినెట్, ప్రభాకర్, రజిత పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రణాళిక



మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్‌ఎం ఏ.కే.గుప్తా, అధికారులు

- ప్రయాణికుల కోసం మరిన్ని వసతులు
- దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం ఏ.కే.గుప్తా
- మధిర, ఎర్రుపాలెం, ఖమ్మం, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లలో తనిఖీ

మధిర: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన మధిర రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) అభయ్‌కుమార్ గుప్తా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆతర్వాత రైల్వే స్టేషన్ ఆవరణ, ప్లాట్‌ఫాంలపై పనుల వివరాలు తెలుసుకున్నారు. డీఆర్‌ఎం వెంట పలువురు అధికారులు ఉన్నారు. వివిధ పార్టీల నాయకులు, రైల్వే ప్రయాణికుల సంఘం బాధ్యులు డీఆర్‌ఎంను కలిసి మధిర రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను హాల్టింగ్ ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని డీఆర్‌ఎం అభయ్‌కుమార్ గుప్తా అధికారులకు ఆదేశించారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఆఫీసర్స్ రెస్ట్ హౌస్‌ను ప్రారంభించిన ఆయన, ఆవరణలో పరిశీలించారు. అధికారులు ఎం.బస్వరాజ్, మనోజ్, ఎస్.కృష్ణారెడ్డి, బీకే.సజ్జా, డీఈఈ ప్రసాద్‌రావు, వెంకటరాజు, సీసీఐ జాఫర్, స్టేషన్ మాస్టర్ జీఎస్‌వీ.ప్రసాద్, హెచ్ఐ మోహన్‌కుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టైల్స్ అప్పుడే ఊడిపోతాయా?

మహబూబాబాద్ రూరల్: రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే ప్రయాణికుల కోసం మరిన్ని వసతులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని డీఆర్‌ఎం అభయ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఇటీవల నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి టైల్స్ ఊడిపోవడాన్ని గుర్తించిన ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కాగా, రైల్వేస్టేషన్ ఆవరణలో ఎస్కలేటర్ ఏర్పాటుచేయాలని, స్టేషన్‌లోకి వచ్చి, వెళ్లే ప్రయాణికుల కోసం కొత్త మార్గం నిర్మించాలని సూచించారు. కాగా, డీఆర్‌ఎం ఏకే.గుప్తాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు, నాయకులు కలిసి ఏపీ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, కేసముద్రంలో నవజీవన్‌కు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. సీనియర్ డీఓఎం మనోజ్‌కుమార్, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్వీఎస్.మోహన్‌కుమార్, సీపీడబ్ల్యూఐ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



మధిరలో మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

ఎర్రుపాలెంలో పరిశీలన

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న నూతన భవనం, ప్లాట్‌ఫాం, మూడో రైల్వే లైన్ పనులను డీఆర్‌ఎం ఏ.కే.గుప్తా పరిశీలించారు. ఈసందర్భంగా స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించడమే కాక ఆర్ఓబీ మంజూరు చేయాలని సర్పంచ్ మొగిలి అప్పారావుతో పాటు సామనూరి కృష్ణార్జున్‌రాజు, ఆకుల నాగేశ్వరరావు తదితరులు విన్నవించారు.



మహబూబాబాద్ స్టేషన్‌లో ఊడిపోయిన టైల్స్‌ను చూపిస్తున్న డీఆర్‌ఎం